క్లుప్తంగా

నేటి నుంచి స్కూల్ గేమ్స్

ఎంఈఓ మల్లేశం

మోమిన్‌పేట: మోమిన్‌పేట, మర్పల్లి, బంట్వారం మండలాల పరిధిలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు జోనల్ స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ మల్లేశం తెలిపారు. అండర్ 14, 17 పోటీలు ఉంటాయని తెలిపారు. మోమిన్‌పేట బాలుర ఉన్నత పాఠశాలలో 22న ఖోఖో, టేకులపల్లి ఉన్నత పాఠశాలలో 25న కబడ్డీ, మర్పల్లి మండలం పట్లూరు ఉన్నత పాఠశాలలో 26న వాలీబాల్ ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల ఆధార్, బోనఫైడ్ సర్టిఫికెట్లను వెంట తీసుకొని రావాలని ఆయన సూచించారు.

'పనుల జాతర'ను జయప్రదం చేయాలి

బొంరాస్‌పేట: పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి చేపట్టనున్న 'పనుల జాతర' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకన్నగౌడ్ తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్ల ఏర్పాటు, పొలాలకు మట్టిరోడ్లు, చెక్ డ్యామ్‌లు, అంతర్గత సీసీ రోడ్లు, వాటర్‌షెడ్లు, పశువుల కొట్టాలు, కోళ్ల పెంపకం షెడ్లు, బావుల తవ్వకం, నర్సరీల పెంపకం, ఈత మొక్కల పెంపకం, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం, నీటినిల్వ కుంటల నిర్మాణం, కందకాల నిర్మాణం, ఉమ్మడి భూములలో చేపల చెరువుల నిర్మాణం, తదితర పనులు చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దుద్యాల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రజా పాలన పనుల జాతర కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అల్లిఖాన్‌పల్లి, సాగారం తండా, నాజుఖాన్‌పల్లి, లగచర్ల గ్రామాల్లో ప్రజా పాలన జాతర నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. లగచర్ల, రోటి బండ తండా గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలు ప్రారంభించడంతో పాటు, నూతన అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలకు భూమి పూజ చేయనున్నారని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటన

తాండూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న పనుల జాతరలో భాగంగా శుక్రవారం పెద్దేముల్ మండలంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పర్యటించనున్నట్లు క్యాంప్ కార్యాలయ సిబ్బంది గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని బండపల్లి, సిద్దన్నమడుగు తండా, ఇందూర్ గ్రామాల్లో గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. కావున ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

పగిలిన పైపులైన్!

- మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న హస్నాబాద్ గ్రామస్తులు



మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో వృథాగా పోతున్న నీరు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గేట్ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో శుక్రవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు. గురువారం రోడ్డు నిర్మాణ పనులు నిర్వహిస్తుండగా గ్రామ సమీపంలోని చెన్నపొల్ల ఆంజనేయులు మామిడి తోట వద్ద గ్రామానికి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలిపోయిందన్నారు. ఆలేడ్‌కు సరఫరా అయ్యే లైన్ కూడా ఇదే కావడంతో రెండు గ్రామాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు ఏర్పడనుందని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని హస్నాబాద్, ఆలేడ్ గ్రామస్తులు గమనించాలని అధికారులు సూచించారు.

గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

కోట్‌పల్లి ఎస్‌ఐ శైలజ

బంట్వారం: గణేశ్ మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని కోట్‌పల్లి ఎస్‌ఐ శైలజ పేర్కొన్నారు. గురువారం ఆమె పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్సవ కమిటీలు ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించాలన్నారు. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఊరేగింపు సమయంలో ట్రాఫిక్ రూల్స్‌తో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు సంభవించకుండా జాగ్రత్త వహించాలన్నారు. ప్రత్యేకంగా డీజేలకు అనుమతిలేదన్నారు. విద్యుత్ కనెక్షన్ల కోసం ట్రాన్స్‌కో అధికారుల అనుమతి తీసుకోవాలన్నారు.



విద్యానగర్ కాలనీలో ఇళ్ల మధ్య చేరిన మురుగు



ఖాళీ ప్రదేశంలో పేరుకపోయిన చెత్త

పడకేసిన పారిశుద్ధ్యం!

- కాలనీల్లోని ఖాళీప్రదేశాల్లో చేరుతున్న చెత్త, చెదారం
- ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

పరిగి: పట్టణంలోని ఆయా కాలనీల్లో పరిశుభ్రత లోపించి పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్త, చెదారంతో నిండిపోతోంది. ఖాళీ ప్రదేశాల్లో మురికి కుప్పలు పెరుగుతున్నాయి. అక్కడ మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్ల మధ్యలో, ఖాళీప్లాట్లలో చేరడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ మురుగు నీరు చేరడంతో దోమలు, ఈగలు వ్యాపించి అంటువ్యాధులు ప్రబలుతున్నాయని చెబుతున్నారు. చెత్త, చెదారం పేరుకపోవడంతో విషసర్పాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. కాలనీలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాల్సిన మున్సిపల్ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. పలు కాలనీల్లో సమస్యలు ఉన్నాయని అధికారుల దృష్టికి ఎన్ని సార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

డ్రైనేజీ నిర్వహణ అస్తవ్యస్తం

పరిగి మున్సిపల్‌లో మొత్తం 15 వార్డులు ఉన్నాయి. పట్టణంలోని అన్ని కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్డుపైకి పారుతుంది. సిబ్బంది చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతుంది. అంతేకాకా కాలనీలో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రతి ఏడాది డ్రైనేజీ వ్యవస్థలు బాగు చేయాలని ప్రజలు చెబుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

నిర్లక్ష్యంగా ఆటో సిబ్బంది

మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు, 5వ, 6వ, 9వ వార్డులో ఈ సమస్యలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. అనుబంధ గ్రామాలైన తుంకుల్‌గడ్డ, సుల్తాన్‌నగర్, ఎర్రగడ్డపల్లిలో పారిశుద్ధ్య నిర్వహణకు ఆటోలు, కార్మికులు ఎవరు సక్రమంగా రావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అన్ని కాలనీల్లో పలు సమస్యలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇళ్ల మధ్యలో మురుగు చేరడంతో ఇబ్బందులు తప్పడం లేదని వివరిస్తున్నారు. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో నిండి పోతోందని, చెత్తను తొలగించాలని మున్సిపల్ అధికారులకు చెబుతున్నప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెలువెత్తుతున్నాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు ఇళ్ల మధ్యలో నిలిచి దుర్గంధం వ్యాపింపజేస్తోందని పేర్కొంటున్నారు. కాలనీల్లోని చిన్నపిల్లలు నిత్యం రోగాల బారిన పడుతున్నారని మొరపెట్టుకున్నా ఎవరు స్పందించడం లేదు.

త్వరలో పరిష్కరిస్తాం



మురుగు కాల్వ, సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.28 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలోనే పనులు ప్రారంభించి ప్రజల సమస్యను పరిష్కరిస్తాం. ప్రతీకాలనీలో పర్యటించి ఎక్కడ ఎలాంటి సమస్య ఉందో తెలుసుకొని వెంటనే పనులు ప్రారంభించి పరిష్కరిస్తాం.

– వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్, పరిగి

చట్టాలపై అవగాహన అవసరం

దుద్యాల్ పోలీస్ స్టేషన్ టీం

దుద్యాల్: ప్రతీఒక్కరికి చట్టాలపై అవగాహన అవసరమని, విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలని దుద్యాల్ పోలీస్ స్టేషన్ టీం సభ్యులు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలో చెట్టుపల్లి తండా సమీపంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు మాట్లాడారు. ప్రస్తుతం ఎదురవుతున్న మోసాలు, అన్యాయాలపై, చట్టాలను వినిమోగించుకునే విధానం గురించి వివరించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న దాడులు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, డయల్ 100, షీ టీం 181, సీసీ కెమెరాల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలు వంటి వాటి గురించి వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణ, మద్యం, బ్యాంకింగ్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్, సైబర్ నేరాలు వంటి అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శంకర్, అమృత, కళాజాత బృందం సభ్యులు, పాఠశాల ప్రత్యేక అధికారి రాధిక తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీస్ బృందం

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్



విద్యార్థులకు టై, బెల్టు అందజేస్తున్న బీజేపీ నేతలు

కుల్కచర్ల: ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్యా బోధన చేపడుతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ పేర్కొన్నారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 112 మంది విద్యార్థులకు టై, బెల్టులను మండల విద్యాధికారి హబీబ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నిరుపేద విద్యార్థులకు తన వంతు సహాయసహకారాలను అనునిత్యం అందించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేశ్, శైలజ, శ్రీలత, చైతన్య, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు గాదె మహిపాల్, మండల కోశాధికారి ప్రవీణ్, గిరిజన మోర్చా అధ్యక్షుడు మహేశ్, సీనియర్ నాయకులు చంద్రలింగం, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్

అనంతగిరి: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్‌లో పలు వార్డుల్లో చేపడుతున్న శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణంలో ఇప్పటికే రెండు డెంగ్యూ కేసులు నమోదయ్యాయన్నారు. కాబట్టి ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత అలవాటు చేసుకోవాలన్నారు. ఎక్కడ కూడా నీటి నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. పట్టణంలోని 3 వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. ప్రజలు వైద్యులు చెప్పిన సూచనలను తప్పకుండా పాటించాలని పేర్కొన్నారు. అనంతరం కొత్తగడిలోని బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. అక్కడ శానిటేషన్‌పై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జాకీర్ అహ్మద్

ముదిరాజ్‌లు సమష్టిగా పోరాడాలి

మండల అధ్యక్షుడు వెంకటేశం



నూతన కమిటీని సన్మానిస్తున్న వెంకటేశం

మర్పల్లి: ముదిరాజ్‌లు హక్కుల సాధనకు సమష్టిగా పోరాడాలని మండల అధ్యక్షుడు పులుమద్ది వెంకటేశం సూచించారు. గురువారం మండల పరిధిలోని రామపూర్‌లో ముదిరాజ్‌కులస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతిఒక్కరూ కలిసిమెలిసి ఉండాలని, చిన్న, చిన్న సమస్యలు ఉంటే గ్రామంలోనే పరిష్కరించుకోవాలన్నారు. ఇతర ఏమైనా ఇబ్బందులు ఉంటే మండల కమిటీ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగించుకోవాలన్నారు. అనంతరం ముదిరాజ్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఆలంగోల రమేశ్, ఉపాధ్యక్షుడిగా గోనెల లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా గోనెల సంగన్న, కార్యదర్శిగా బోయిని ప్రభు, కోశాధికారిగా గోనెల ప్రభు, కార్యవర్గ సభ్యుడిగా గోపాల్, జర్నయ్య, నవీన్‌కుమార్, చిరంజీవిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు నర్సింలు, అంజి, కృష్ణ, శ్రీను, వెంకటేశం, బోయిని మధుకర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని మండల నాయకులు సన్మానించారు.

రేపు వాలీబాల్ జోనల్ స్థాయి టోర్నమెంట్

కుల్కచర్ల: జోనల్ స్థాయిలో అండర్ 14, 17వాలీబాల్ టోర్నమెంట్ శనివారం నుంచి ప్రారంభించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్‌కుమార్, జోనల్ స్థాయి కార్యదర్శి ఖాజా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుల్కచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల బాలురలో ఈ టోర్నమెంట్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8187891301, 9948640187 నంబర్లపై సంప్రదించాలని కోరారు.

'చైతన్య'లో శ్రీకృష్ణ జన్మాష్టమి

ధారూరు: ధారూరులోని చైతన్య పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి ఘనంగా నిర్వహించారు. పాఠశాలలోని చిన్నారులు కృష్ణయ్య, గోపికల వేషాధారణలో అలరించారు. పాఠశాల నుంచి మండల కేంద్రంలోని వీధుల్లో కోలాటాలు వేస్తూ, దాండియా ఆడుతూ నృత్యాలు చేశారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకలు ప్రిన్సిపాల్ మధు ఆధ్వర్యంలో నిర్వహించారు.

అందుబాటులో వ్యవసాయ పరికరాలు

చేవెళ్ల: మండలంలో రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉన్నాయని, వాటి కోసం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.శంకర్‌లాల్ గురువారం ఓ ప్రటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీపై, మిగితా రైతులకు 40 శాతం సబ్సిడీపై బ్యాటరీ స్ప్రేయర్ – 175, పవర్ స్ప్రేయర్ -24, రోటవేటర్లు -9, కల్టివేటర్లు, కేజ్ వీల్స్, ఎంబీ ప్లౌ, డిస్క్ హారో, రోటో పడ్లర్ -11, ట్రాక్టర్‌తో ఎరువులు, విత్తనాలు వేసే డ్రిల్స్-2, బండి ఫార్మర్ -1, పవర్ వీడర్ -1, బ్రష్ కట్టర్ -3, పవర్ టిల్లర్ -1, మొక్కజొన్న షెల్లర్ -1, స్ట్రా బెలర్ -2 తదితర వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫొటో, ట్రాక్టర్‌తో నడిచే పనిముట్లకు ట్రాక్టర్ ఆర్సీని జతపరిచి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి ఇవ్వాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హక్కుల సాధనకు పోరాటం

షాబాద్: బీసీల హక్కుల సాధనకు నిరంతర పోరాటం చేస్తామని, జనాభాలో అత్యధికంగా బీసీలకు అన్ని విధాలా అన్యాయం జరుగుతుందని బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ అన్నారు. గురువారం కక్కులూర్‌లో బీసీసేన కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా రాజేందర్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా కావలి శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలం, యువజన కమిటీ అధ్యక్షుడిగా చాకలి తిరుపతి, ఉపాధ్యక్షుడిగా జింకల శివశంకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మంగలి నర్సింలు, కోశాధికారిగా పట్నం శెట్టి మోహిత్, కార్యదర్శిగా చాకలి పురుషోత్తంను ఎన్నుకున్నారు. బీసీలకు స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలంతా పోటీకి సిద్ధంగా ఉండాలని సూచించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మాజీ కౌన్సిలర్లు

తాండూరు టౌన్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మాజీ కౌన్సిలర్లు సంగీతా ఠాకూర్, వెంకన్న గౌడ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్, ఇందిరమ్మ కాలనీ పరిధిలో వైద్య, మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు పెరిగి వాటి వల్ల డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలను సైతం శుభ్రంగా ఉంచుకోవాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపల్ వాహన సిబ్బందికి అందజేయాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది పలువురికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకినట్లు నిర్ధారణ అయితే జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేయనున్నట్లు డాక్టర్ అజయ్, డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. మున్సిపల్ సిబ్బంది నీరు నిల్వ ఉన్న చోట దోమ లార్వాలు పెరగకుండా రసాయనాలను పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రకాశ్, హెల్త్ అసిస్టెంట్ సుదర్శన్, ఏఎన్‌ఎంలు మల్లమ్మ, సుధ, శాంత, జవాన్ అశోక్, ఆశా వర్కర్లు సుజాత, షబానా తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో అవగాహన కల్పిస్తున్న మాజీ కౌన్సిలర్, వైద్య సిబ్బంది

వారం రోజులుగా తాగునీరు బంద్

- ఎన్కేపల్లి వాటర్‌ట్యాంక్ వద్ద కాలిపోయిన బోరుమోటార్
- మరమ్మతులు చేయించని అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని ఎన్కేపల్లిలో బోరుమోటారు వైర్లు కాలిపోవడంతో వారం రోజులుగా నీటిసరఫరా సక్రమంగా లేదని గ్రామ నాయకుడు లక్ష్మప్ప తదితరులు వాపోయారు. వాటర్‌ట్యాంక్ ఎన్కేపల్లికి నీటి సరఫరా అవుతుంది. కానీ అక్కడ బోర్‌మోటార్ వైర్లు కాలిపోడంతో సమస్య తీవ్రమైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ ట్యాంక్‌నుంచే ఊరంతటికి నీటి సరఫరా అవుతుందని తెలిపారు. కాలిపోయిన బోరుమోటార్ వైర్లను మరమ్మతు చేయించకపోవడంతో వారం రోజులుగా తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని చెబుతున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శి ప్రభాకర్ దృష్టికి తీసుకపోగా స్పందించారు. త్వరలో మరమ్మతు చేయించి తాగునీటి సరఫరా చేయిస్తానన్నారు.



వాటర్‌ట్యాంక్ వద్ద గ్రామస్తులు

పాత పెన్షన్ విధానం కొనసాగించాలి



బొంరాస్‌పేట: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ మండల నాయకులు

బొంరాస్‌పేట: రాష్ట్ర ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని గురువారం మండల విద్యావనరుల కేంద్రం వద్ద సంఘం నాయకులు గోడపత్రిక ఆవిష్కరించారు. సెప్టెంబర్ 1, విద్రోహక దినంగా గుర్తిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాకు తరలిరావాలని పేర్కొన్నారు. దీనికి ఇంటర్మీడియట్ విద్యాశాఖ జిల్లా నోడల్ అధికారి శంకర్‌నాయక్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధానకార్యదర్శి శివర్ధన్, పీఆర్టీయూ మండల నాయకులు మెహరాజ్, శ్రీనివాస్, అనసూయ, నవనీత, ఖదీర్, జంగయ్య, సీఆర్‌పీ సోమ్లా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ విద్రోహ దినం పోస్టర్ ఆవిష్కరణ

దుద్యాల్: సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న సీపీఎస్ విద్రోహ దినం మహాధర్నా పోస్టర్‌ను హకీంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పీఆర్టీయూ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నరేందర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పెన్షన్ విధానంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎదిరించేందుకు ఈ ధర్నా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతీ ఉద్యోగి ఈ మహాధర్నాకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సెక్రెటరీ అమర్నాథ్, సంఘం ఇతర సభ్యులు రవికుమార్, వేణుగోపాల్, తిరుమలేశ్, వెంకటేశ్, కరుణాకర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



దుద్యాల్: ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

విద్యార్థులపై నిర్లక్ష్యం తగదు

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్

దోమ: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్ తెలిపారు. గురువారం దోమ మండల పరిధిలోని బుద్లాపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఉపాధ్యాయులు మెరుగైన విద్యా బోధన చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చదవడం, రాయడం నేర్పించాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సీఆర్‌పీ రెడ్యానాయక్, ఉపాధ్యాయులు లక్ష్మణ్, భీంమ్లా, సువర్ణ, మధు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు లాల్యానాయక్

యూరియా సరఫరాలో కేంద్రం విఫలం

మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

బంట్వారం: తెలంగాణకు తగినంత యూరియా సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం బంట్వారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రానికి పంపాల్సిన యూరియాను బీజేపీ పాలిత రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆయన విమర్శించారు. మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం సొసైటీల దగ్గర యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే సమస్య తీవ్రంగా ఉందన్నారు. అన్నదాతల కష్టాలు కేంద్ర సర్కారుకు పట్టడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి 9.80 లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 5.30 లక్షల టన్నులు మాత్రమే వచ్చిందన్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ ఎంపీల ఒత్తిడితో మరో 50 వేల టన్నులు రాష్ట్రానికి సరఫరా చేయనున్నారన్నారు. రాష్ట్ర బీజేపీ ఎంపీలకు రైతులపై చిత్తశుద్ధి ఉంటే పెండింగ్‌లోని 4లక్షల టన్నుల యూరియాను వెంటనే తెప్పించాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

చేవెళ్ల: గత కొద్ది రోజులుగా కురిసిన వర్షాలకు మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన షాబాద్ పెంటయ్య ఇల్లు కూలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనె ప్రతాప్‌రెడ్డి తనవంతు సహాయంగా రూ.50వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మేరకు ఆ నగదును మాజీ ప్రజాప్రతినిధులు బాధితులకు అందజేశారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాలె యాదయ్యతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని బాధితుడికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గడ్డమీది పెంటయ్య, మాజీ సర్పంచ్‌లు అనంత రాములుగౌడ్, కవ్వగూడం విజయలక్ష్మీనర్సింలు, మాజీ ఎంపీటీసీ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.